క్లుప్తంగా

పూడిన బోరు.. పట్టించుకోని తీరు


పూడుకుపోయిన చేతి పంపు

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ రాజీవ్‌నగర్‌లో తాగునీటి అవసరాలకు ఉపయోగించే చేతి బోరు పూడిపోయింది. దీంతో బోరు వినియోగానికి ఇబ్బందిగా మారింది. ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన చేతి పంపు నిరుపయోగంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి చేతిబోరుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దేవకుమార్ సేవలు మరువలేం


దేవకుమార్‌ను సన్మానిస్తున్న డీఈ, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని స్థానిక తెలుగు గంగ కార్యాలయంలో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన దేవకుమార్‌కు శనివారం డీఈ పెంచలయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవకుమార్ అంకిత భావంతో విధులు నిర్వహించారని ఆయన సేవలను కార్యాలయ అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఈఈ ప్రసాద్, విశ్రాంత డీఈ రాఘవరెడ్డి, ఏఈలు ఖాసీం, వైశాలి, మునిరాజా, గాయత్రి, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాదెండ్లకు ఘన స్వాగతం


మంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా సివిల్ సప్లై డీఎం సుమతి

రేణిగుంట: తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా సివిల్ సప్లై డీఎం సుమతి, శ్రీకాళహస్తి ఆర్‌డీఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, వినుత తదితరులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి తిరుపతి చెన్నారెడ్డి కాలనీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో దీపం -2 కార్యక్రమంలో పాల్గొనడానికి బయల్దేరి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని మంత్రి దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

తిరుపతి కల్చరల్: వడమాలపేట మండలం ఏఎంపురం ఎస్టీకాలనీలో చిన్నారి సాన్విక్‌పై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడు సుశాంత్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలైన గంజాయి, సారాయి తదితరాలతోనే యువత పక్కదారి పడుతోందని వెల్లడించారు. ఇంటర్‌నెట్‌లో అశ్లీల చిత్రాలు రాకుండా అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందుతున్నాయని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం, ఐదు ఎకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం అదనంగా మరో రూ.15 లక్షలు ఇవ్వాలని కోరారు.

డిసెంబర్ 1న అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో డిసెంబర్ 1వ తేదీన అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు గోల్డ్ ఇన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్, నేషనల్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ప్యాట్రన్ ఎ.ఈశ్వరప్రకాష్ తెలిపారు. వారు శనివారం జోష్ ప్రాపర్టీస్ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. గోల్డెన్ ఇండియా ఫెడరేషన్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల పోటీలను తిరుపతిలో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు మెడల్స్ అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9505873777, 7013274433 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జి.హరి, బద్రి, అరుణ్, కుమార్ పాల్గొన్నారు.

మా ఇంటి దీపాన్ని ఆర్పేశాడు


విలపిస్తున్న చిన్నారి తల్లి

దీపావళి రోజే ఆ ఇంటి దీపాన్ని ఆర్పేశాడు ఓ దుర్మార్గుడు. శుక్రవారం నాడు దేశమంతా మహాలక్ష్మికి పూజలు చేస్తుంటే ఆ ఇంటి మహాలక్ష్మి గొంతు నొక్కేశాడు. ఆర్థిక లావాదేవీలు ఉన్న వారు, అయినవాళ్లు, స్నేహితులు ఇలా తెలిసినవాళ్లే ఆడబిడ్డల పాలిట కాలయములవుతుంటే ఎవరిని నమ్మాలో తెలియక ఆడబిడ్డల తల్లిదండ్రులు మథనపడుతున్నారు. మత్తు పదార్థాలు మనుషుల్ని మృగాలకంటే హీనంగా మార్చేస్తుంటే జరిగే ఈ అరణ్యకాండకు అంతమెప్పుడని ప్రశ్నిస్తున్నారు. అన్ని మతాలవారు, కులాల వారు కలిసిమెలసి అన్నదమ్ముల్లా ఉండే గ్రామానికి ఓ చీడపురుగులా చేరాడని స్థానికులు మండిపడుతున్నారు. కళ్లముందు ఆడుతూ తిరిగిన చిన్నారి, కానరాని లోకాలకు వెళ్లిపోయిందంటే నమ్మలేకున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

- అక్కున చేర్చుకున్న పాపానికి శాపంగా మారాడు
- గ్రామానికే మాయనిమచ్చగా మిగిలాడు
- ఆడపిల్లల తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి?
- విషాదంలో ఏఎం పురం

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం, ఏఎం పురం గ్రామానికి చెందిన మమతకు కేవీబీ పురం, ఓబూరుకు చెందిన మధుతో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరిని మూడున్నరేళ్ల కుమార్తె, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. పదిరోజుల క్రితం కూలిపనుల నిమిత్తం భర్త, పిల్లలతో ఏఎం పురం ఎస్టీ కాలనీకి వచ్చిన మమత కుమార్తెను ఆటవికంగా చంపేసిన సంఘటన ఆ గ్రామానికే మాయని మచ్చగా మిగిలింది. మానవత్వం ఉన్న ప్రతి హృదయాన్ని ఈ సంఘటన కలిచివేసింది. ఆ గ్రామంలో ఏ తలుపు తట్టినా ఈ కన్నీటి గాథే వినిపిస్తోంది. మొన్నటి వరకు వీధిలో ఆడుకుంటూ తిరిగిన పాపను, దీపావళి చిచ్చుబుడ్డీలు కాల్చుతుంటే చిందులు వేసిన చిన్నారిని తాము కళ్లారా చూశామని పండగ ముగియక మునుపే చిన్నారి జీవితం ముగిసిపోయిందని తలచుకుంటేనే బాధను తట్టుకోలేకపోతున్నామని గ్రామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు. నిందితుడు సుశాంత్ కన్నతల్లి చిన్నతనంలోనే చనిపోయింది. తండ్రి బాధ్యతలు మరచి దూరప్రాంతాలకు వెళ్లిపోయాడు. పెదనాన్నా, పెద్దమ్మ సుశాంత్‌ను పెంచి పెద్ద చేశారు. అయితే అతని నడవడిక నచ్చక తరిమేశారు. అలాంటి సుశాంత్‌ను చేరదీయడమే చిన్నారి తల్లిదండ్రులు చేసిన తప్పయింది. ఆ ఇంటి దీపాన్ని ఆర్పేసింది. ఇలాంటి రాక్షసునికి గ్రామంలో తమ కళ్ల ఎదుటే ఉరిశిక్ష వేయాలని, మరెక్కడా ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో పోలీసు గస్తీ

గ్రామంలో అత్యంత బాధాకరమైన సంఘటన చోటుచేసుకోవడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసే ఆస్కారం ఉంటుందేమో అన్న ఆలోచనతో శాంతిభద్రతల కోసం గ్రామంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామంలోని అరుగులపై ఉంటూ పర్యవేక్షించారు.

ప్రాణస్నేహితుడే కాలయముడు

చిన్నారికి మేనమామ అయిన హరికృష్ణకు ప్రాణ స్నేహితుడే సుశాంత్. ఒకే గ్రామానికి చెందిన వారు కావడం సమీప గృహస్తులే కావడంతో వీరిద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే తిరిగారు. ఇద్దరూ గతంలో బెంగళూరులోని ప్లాస్టిక్ గ్లాస్ తయారుచేసే కంపెనీలో పనిచేసేవారు. ప్రస్తుతం ఎక్కడ ఏ పని దొరికినా అక్కడకు వెళ్లి ఆ కూలి పనులు చేస్తున్నారు. దీపావళి పండుగకు అత్తగారింటికి వచ్చిన చిన్నారి తండ్రి మధు, హరికృష్ణ, సుశాంత్ కలిసి శుక్రవారం ఉదయం ఒక ఇంటి మోల్డింగ్ పనులకు కూలీలుగా వెళ్లారు. వచ్చిన డబ్బులతో మధ్యాహ్నం మద్యం తాగారు. ఇలా వారి పంచనే ఉన్న సుశాంత్ అతిగా మద్యం తాగి అదను చూసి పైశాచికంగా చిన్నారిని బురదకాలువలో పూడ్చిపెట్టి పొట్టనపెట్టుకున్నాడు. మద్యం మత్తులో ఇంతటి అఘాయిత్యం చేసేందుకు ఆస్కారం ఉండదని గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటైనపుడే ఈ స్థాయి ఘోరాలు చేస్తారని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

అయినవారే అక్కున చేర్చుకోలేదు

తల్లిదండ్రులు లేరని చిన్నతనం నుంచి పెంచిన పెదతండ్రి, పెదతల్లినే సుశాంత్ గౌరవించేవాడు కాదు. తాగిన మత్తులో వచ్చి నానాయావ చేసేవాడు. సంపాదించిన డబ్బులు పైసా కూడా ఇంటికి ఇచ్చేవాడు కాదు. పెద తండ్రి, పెద తల్లి మరణంతో ఇతని గురించి తెలిసిన అయిన వాళ్లు ఎవరూ ఇతన్ని చేరదీయలేదు.

వివరాల నమోదులో సచివాలయ సిబ్బంది

సంఘటనకు సంబంధించి వివరాల నమోదులో సచివాలయ సిబ్బంది గ్రామంలో పర్యటించారు. చిన్నారి ఉన్న ఇల్లు, నిందితుడు ఉన్న ఇల్లు, ఇరుగు పొరుగుల ఇళ్లకు వెళ్లి సంఘటనకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు. నివాసాల ఫొటోలు తీసుకున్నారు.

ఓబూరులో చిన్నారికి అంత్యక్రియలు

చిన్నారి తండ్రి మధు స్వగ్రామం సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలం ఓబూరు కావడంతో చిన్నారి అంత్యక్రియలు అక్కడే నిర్వహించనున్నారు. దీంతో చిన్నారి మృతదేహాన్ని ఓబూరులోని నివాసానికి తరలించారు.

సాయంత్రం తీసుకెళ్లగా చూశా



చిన్నారి ఉన్న ఇంటికి పక్కనే మా ఇల్లు, సుశాంత్ ఇంటి నుంచి చిన్నారిని తీసుకెళుతుండగా చూశాను. అయితే తిరిగి వచ్చేసయంలో అతను ఒంటరిగా వచ్చాడు. చిన్నారి గురించి అడిగితే తటపటాయించాడు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. మేము పట్టుకొని పోలీసులకు చెప్పాం. ఇలాంటి విషాదకరమైన సంఘటన గ్రామంలో ఎప్పుడూ జరగలేదు. నమ్మకంగా ఉంటూ గొంతుకోశాడు. పసికందును పొట్టన పెట్టుకున్నాడు.

– అలేఖ్య, ఏఎం పురం ఎస్టీకాలనీ

నమ్మించి మోసం చేశాడు



నా కళ్లముందే ఇంటి నుంచి మనవరాల్ని ఏదైనా కొనిస్తా అని అంగడికి తీసుకెళ్లాడు. నా కుమారునికి మంచి స్నేహితుడే కదా అని అతనిపై నమ్మకంతోనే పంపించాం. నవ్వుతూ అతనితో వెళ్లిన మనవరాలిని మళ్లీ శవంగా చూస్తానని ఊహించలేదు. ఇలాంటి నరహంతకులకు ఉరిశిక్ష వేయాలి. మరో చిన్నారి ఇలాంటి దుర్ఘటనలో బలికాకూడదు.

– మొగిలమ్మ, చిన్నారి అవ్వ, ఏఎం పురం ఎస్టీకాలనీ


ఆస్పత్రి వద్ద ఆవేదనలో గ్రామస్తులు


గ్రామంలో అరుగులపై పోలీసులు

ప్రజలకు సత్వర న్యాయం అందించాలి


న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: ప్రజలకు సత్వర న్యాయం అందించాలని జిల్లా జడ్జి భీమారావు పేర్కొన్నారు. శనివారం సబ్‌కోర్టు పరిశీలన కోసం విచ్చేశారు. ఈ సందర్భంగా జడ్జిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీపీ కన్నలి ప్రభాకర్, కొండేటి కుమార్, న్యాయవాదులు వేడం మల్లికార్జున, గుమ్మడి శేఖర్ పాల్గొన్నారు.

గుంతల రోడ్డును బాగు చేయండి


సమస్యలు ఏకరువు పెడుతున్న మహిళలు

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు పంచాయతీ సాధనవారిపాళెంకు వెళ్లే ప్రధాన రోడ్డు అభివృద్ధి గురించి అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గుంతలు పడిన రోడ్డుపై బాధలు అన్నీఇన్నీ కావని వాపోతున్నారు. అంతేకాక గ్రామంలో రోడ్లు, మురుగునీటి కాలువలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు అన్ని విధాలా గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

తెలుగుగంగ కాలువలో పడి వ్యక్తి మృతి


వెంకట సుబ్బయ్య (ఫైల్)

శ్రీకాళహస్తి: తెలుగుగంగ కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా.. తొట్టంబేడు మండలం చిన్నసింగమాలకు చెందిన వెంకట సుబ్బయ్య(48) మంగళవారం సొంత పనుల నిమిత్తం చూసకరుని వస్తుండగా తెలుగుగంగ కాలువలో కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి జారి నీటిలో పడిపోయాడు. దీంతో రెండు రోజులుగా భర్త కనిపించడంలేదని భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం కోవనూరు వద్ద కాలువలో వెంకట సుబ్బయ్య మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. దీంతో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హోమియోపతి ఆస్పత్రికి అటెండరే దిక్కు!



డాక్టరు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ, బాక్సుల్లో వృథాగా ఔషధాలు


హోమియోపతి ఆసుపత్రి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని హోమియోపతి ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు రెండేళ్లుగా లేకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో హోమియోపతి ఆసుపత్రిలో ఒక డాక్టరు, ఫార్మసిస్ట్ , అటెండర్ పని చేసేవారు. ప్రతి రోజు వివిధ రోగాలతో రోజుకు 40 మంది రోగులు వచ్చేవారు. ముఖ్యంగా మోకాళ్ల నొప్పులు, ఆస్తమా, మొలలతో బాధపడేవారు ఎక్కువగా వస్తుండేవారు. రెండేళ్లుగా డాక్టరు, ఫార్మసిస్ట్ లేరు. అటెండర్ మాత్రమే ఉన్నారు. వైద్యుడు లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే మందులు బాక్సుల్లోనే కాలం చెల్లిపోతున్నాయి. ప్రతి రోజు వైద్యం కోసం వచ్చే రోగులు డాక్టరు లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యుడు , ఫార్మసిస్ట్‌ను నియమించాలని రోగులు కోరుతున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

శ్రీకాళహస్తి: 20 మద్యం సీసాలతో సహా బెల్టుషాపు నిర్వాహకుడు గిరిబాబును ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు పలు బెల్టుషాపులపై దాడులు చేశారు. ఇందులో భాగంగా పానగల్ రైల్వేగేటు సమీపంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న గిరిబాబును అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలి


సత్యవేడు డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

సత్యవేడు: విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలని సత్యవేడు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.సుజాత పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'దేశ సమైక్యతలో సర్దార్ వల్లబాయ్ పటేల్ పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 60 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్యాముల్ అరవింద్, హన్నా, హరి ప్రసాద్, మురళీమోహన్, బాషా, రామ సుంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


సుదేవ్ (ఫైల్)

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలోని గోవర్ధనపురం గ్రామానికి చెందిన సుదేవ్ (22) నాలుగు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల కిందట వ్యక్తిగత పనుల నిమిత్తం నాయుడుపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా జాతీయ రహదారిలో సుదేవ్ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో తిరుపతి లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మగుడి వద్ద కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వారికి ఆలయ అధికారులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యకమలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భూమన ప్రమాణ స్వీకారాన్ని జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేయనున్న ప్రమాణ స్వీకారాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఫిరోజ్‌బాబు

సత్యవేడు: ఫిరోజ్ డెంటల్ ఆస్పత్రి తిరుపతి వారిచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 220 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్ ఎండీ ఫిరోజ్ బాబు ఆధ్వర్యంలో వైద్యులు దేవరాజు, కుమార్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉదయం, రాత్రి దంతాల శుభ్రత, పరిరక్షణపై అవగాహన కల్పించారు. 53 మంది విద్యార్థులకు చికిత్స అవసరమని సూచించారు. విద్యార్థులకు ఉచితంగా దంతాల శుభ్రతకు పేస్టు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పాండురంగయ్య, వెంకటేశ్వర్లు, వైవీఎల్ కుమార్, మనోహర్, అన్వర్ బాషా, కృష్ణయ్య, భాస్కర్, రఫీ విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు


సీనియర్ అసిస్టెంట్ నాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామ చెరువులోని మట్టిని ఎలాంటి అనుమతి లేకుండా బయట ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ చెరువులోని మట్టిని ప్రభుత్వ అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా తరలిస్తున్నారని పేర్కొన్నారు. చెరువులోని మట్టిని తరలించటంతో చెరువు గుంతలమయం అయిందన్నారు. మట్టి తరలింపును అడ్డుకోవలసిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు గ్రామ చెరువులోని మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరారు.

ఆకాశదీపానికి ప్రత్యేక పూజలు


కార్తీక దీపానికి పూజలు చేస్తున్న అర్చకులు, ఈవో

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాశదీపాన్ని వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

రేణిగుంట–పాపానాయుడుపేట రోడ్డు విస్తరణ చేపట్టండి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట: రేణిగుంట–పాపానాయుడుపేట రహదారి విస్తరణ చేపట్టాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి విన్నవించారు. ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి మండలంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాపానాయుడుపేట– రేణిగుంట మార్గాన్ని డబుల్ రోడ్డుగా విస్తరించాలని గ్రామస్తులు కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, జడ్పీటీసీ తిరుమలయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, పొన్నారావు, పేరం నాగరాజునాయుడు పాల్గొన్నారు.